# జిల్లా వార్షిక రుణ ప్రణాళిక ఖరారు



బ్యాంకర్లు, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ తదితర అధికారులు

- 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.13,378.17 కోట్లు
- లక్ష్యసాధనకు బ్యాంకర్లు సహకరించాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, మే 14 (నమస్తే తెలంగాణ) : జిల్లా వార్షిక రుణ ప్రణాళిక 2025-26 కింద రూ. 13,378.17 కోట్లతో ఖరారు చేశారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో కలెక్టర్ పమేలా సత్పతి డీసీసీ, డీఎల్ఆర్సీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షిక రుణ ప్రణాళికను ఖరారు చేశారు. అలాగే గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రైతులకు రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాల రుణాలు, రికవరీ, పీఎం జీపీవై రుణాలు, ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖల పథకాలకు సంబంధించి రుణ లక్ష్య పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యసాధనకు రుణాలు అందించడంలో బ్యాంకర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు రూ. 11,627.04 కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. వివిధ పథకాల్లో మంజూరైన రుణాల రికవరీపై శ్రద్ధ వహించాలని కోరారు. యువతకు ఉపాధి కల్పించే విషయంలో చొరవ చూపాలని బ్యాంకర్లకు సూచించారు. అనంతరం 2025-26 ఆర్థిక సంవత్సరం వార్షిక రుణ ప్రణాళికను రూ.13,378.17 కోట్లతో కలెక్టర్ ఆవిష్కరించారు. వ్యవసాయ అవసరాల కోసం రూ.5,157.33 కోట్లు ఎంఎస్ఎంఈ కింద రూ.3,239.40 కోట్లు, విద్యా రుణాలు రూ.49.50 కోట్లు, గృహ రుణాలు రూ.310.50 కోట్లు, ఎగుమతి రంగాలకు రూ.6.40 కోట్లు, సామాజిక మౌలిక సదుపాయాలు రూ.20.32 కోట్లు, పునరుత్పాదక ఇంధనం రూ.50.97 కోట్లు, ఇతర ప్రాధాన్యతా రంగానికి రూ.255 కోట్లు, ఎస్హెచ్జీ రుణాలకు రూ. 875 కోట్లు, ఇతర రంగాలకు రూ.3,413.75 కోట్ల రుణాలుగా బ్యాంకర్లు అందజేయాలని కోరారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, రాజీవ్ యువ వికాసం కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హత గల లబ్ధిదారుల వివరాలను మూడు రోజుల్లోగా సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వర్లు, లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు, ఆర్బీఐ అధికారి సాయితేజరెడ్డి, నాబార్డ్ జీజీఎం ఎస్ జై ప్రకాశ్, ఎస్బీఐ ఏజీఎం వెంకటేశ్, చీఫ్ మేనేజర్ రామచంద్రుడు, టీజీబీ ఆర్ఎం బాల నాగు, కేడీసీసీబీ డీజీఎంతోపాటు అన్ని బ్యాంకుల కంట్రోలర్స్, కో ఆర్డినేటర్లు, కరీంనగర్ లోకల్ బ్రాంచ్ మేనేజర్స్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, డీడబ్ల్యూవో సరస్వతి, ఉద్యాన వన శాఖ డీడీ శ్రీనివాస్, అడిషనల్ డీఆర్డీఏ సునీత తదితరులు పాల్గొన్నారు.

## డిస్కం స్థాయిలో కరీంనగర్ సర్కిల్‌కు మొదటి ర్యాంకు

ముకరంపుర, మే 14: ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ(ఎన్పీడీసీఎల్) సీఎండీ వరుణ్ రెడ్డి ఏప్రిల్ నెలకు గానూ ఉత్తమ ప్రతిభ చూపిన ఉద్యోగులు, సిబ్బందికి బుధవారం ర్యాంకులు ప్రకటించారు. నిర్దేశిత పారామీటర్ల ఆధారంగా లక్ష్యాలను పూర్తి చేయడంతో కరీంనగర్ సర్కిల్ డిస్కం స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిందని ఎస్ఈ మేక రమేశ్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. క్షేత్ర స్థాయిలో వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు ఉద్యోగుల మధ్య స్నేహపూర్వక పోటీ తత్వాన్ని పెంచే లక్ష్యంతోనే అధికారులు, సిబ్బందికి బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ ది మంత్ పేరిట సీఎండీ ర్యాంకులు ప్రకటిస్తున్నారని పేర్కొన్నారు. ఏప్రిల్ నెలకు గానూ డిస్కం స్థాయిలో కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ మేక రమేశ్ బాబు మొదటి స్థానంలో నిలిచారు. కరీంనగర్ టౌన్ డీఈ రాజం రెండో స్థానంలో, హుజూరాబాద్ డీఈ ఎస్ లక్ష్మీరెడ్డి మూడో స్థానంలో నిలిచారు. ఉమ్మడి కరీంనగర్ సర్కిల్ స్థాయిలో కరీంనగర్ రూరల్ డీఈ ఎం తిరుపతి మొదటి ర్యాంకు సాధించారు. ఏడీఈల విభాగంలో (అర్బన్)లో కరీంనగర్ టౌన్-2 ఏడీఈ ఎం లావణ్య డిస్కం స్థాయిలో మొదటి ర్యాంకు, రూరల్ విభాగంలో హుజూరాబాద్ ఏడీఈ పీ శ్రీనివాస్ రెండో ర్యాంకు, కరీంనగర్ రూరల్ ఏడీఈ జీ రఘు మూడో ర్యాంకు, అలుగునూరు ఏడీఈ జీ శ్రీనివాస్ నాలుగో ర్యాంక్ పొందారు. ఏఈల విభాగంలో నుస్తులాపూర్ సెక్షన్ ఏఈ రజిత డిస్కం స్థాయిలో 6వ, ఆముదాలపల్లి సెక్షన్ ఏఈ రఘు 9వ, ఆచంపల్లి ఏఈ రాంమోహన్ 10వ ర్యాంకు సాధించారు. అర్బన్ విభాగంలో హుజూరాబాద్ టౌన్ ఏఈ శ్రీనివాస్ డిస్కం లెవెల్లో 2వ, కరీంనగర్ టౌన్-7 ఏఈ మల్లయ్య 3వ, రూరల్ ఈస్ట్ సెక్షన్ ఏఈ సవాయి నాయక్ 4వ స్థానంలో నిలిచారు. ఉమ్మడి కరీంనగర్ సర్కిల్ స్థాయిలో కరీంనగర్ టౌన్-4 ఏఈ భూమయ్య మొదటి, తాడికల్ సెక్షన్ ఏఈ సంపత్ రెడ్డి 2వ ర్యాంకు సాధించారని ఎస్ఈ తెలిపారు. డిస్కం స్థాయిలో కరీంనగర్ సర్కిల్ మొదటి ర్యాంక్ సాధించడంతో సంతోషం వ్యక్తం చేస్తూ డీఈ కే ఉపేందర్, ఎస్ఏవో రాజేంద్రప్రసాద్, పీవో బీ చంద్రయ్య, ఏడీఈ లావణ్య, మునీందర్, రమేశ్ తదితరులు ఎస్ ఈ రమేశ్ బాబుకు పుష్పగుచ్ఛం, పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## తాను మరణించినా.. మరికొందరికి కొత్త జీవితం



మణెమ్మ (ఫైల్)

వీణవంక, మే 14: రోడ్డు ప్రమాదానికి గురై నాలుగు రోజులు మృత్యువుతో పోరాడి ఓడిన ఓ మహిళ అవయవదానంతో మరి కొందరికి జీవితాన్ని ప్రసాదించింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని మామిడాలపల్లి గ్రామానికి చెందిన కొమ్మిడి మణెమ్మ-సమ్మిరెడ్డి దంపతులు. ఈ నెల 10న రాత్రి కరీంనగర్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నారు. మామిడాలపల్లి-పచ్చునూరు గ్రామాల మధ్యలో రోడ్డుపై ఆరబోసిన వడ్ల కుప్పలకు బైక్ తగలడంతో కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో సమ్మిరెడ్డికి స్వల్ప గాయాలు కాగా, మణెమ్మ తలకు తీవ్రగాయాలయ్యాయి. మొదట కరీంనగర్‌కు అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ యశోద హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ నాలుగు రోజులు మృత్యువుతో పోరాడిన మణెమ్మ (47) చివరకు బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు వచ్చారు. దీంతో జీవన్‌దాన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కిడ్నీలు, కళ్లు, లివర్, ఊపిరితిత్తులు సేకరించారు. కాగా, రోడ్లపై ధాన్యం ఆరబోయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారుల నిర్లక్ష్యం వల్లే ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, తమకు న్యాయం కావాలంటూ గ్రామస్తులు సోషల్ మీడియాలో చేస్తున్న పోస్టింగ్‌లు వైరల్‌గా మారాయి.

## అంగన్‌వాడీల్లో ప్రీస్కూల్ సంసిద్ధత మేళాలు

కలెక్టరేట్, మే 14 : జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ సంసిద్ధత మేళా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. బుధవారం నగరంలోని కోతిరాంపూర్-2 అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్బన్ సీడీపీవో కె.సబితకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపితే, పౌష్టికాహారంతో పాటు విద్యపై చిన్నారుల్లో అవగాహన కల్పించే, పలు కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రథమ్ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పిల్లలకు ఆటలు, పాటల ద్వారా చదువుకునే విధానంపై ఏర్పాటు చేసిన నృత్యరూపక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయ, అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, పి.సరిత, ప్రథమ్ ఎన్జీవో బాధ్యులు రాజేందర్, ప్రీస్కూల్ పిల్లలు, తల్లిదండ్రులు, కిశోర బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, మే 14: పోతిరెడ్డిపల్లి మానేరువాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను వీణవంక పోలీసులు పట్టుకొన్నారు. ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి, విలాసాగర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు చెవుల సంపత్, వేల్పుల కనకరాజుపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్ఐ సాయికృష్ణ పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

కలెక్టరేట్, మే 14 : జిల్లాలో ఇప్పటికే మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం గృహనిర్మాణ సంస్థ అధికారులు, ఎంపీడీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మొదటి దఫాగా జిల్లాలో 2027 ఇళ్లు మంజూరు అయ్యాయని, వీటిని పూర్తిస్థాయిలో పనులు ప్రారంభించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈవారాంతంలోగా అన్ని ఇండ్లకు మార్కింగ్ పూర్తి చేయాలన్నారు. 15 రోజుల్లోగా మార్కింగ్ అయిన ఇళ్లన్నీ బేస్‌మెంట్ లెవల్‌కు రావాలన్నారు. లబ్ధిదారులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించాలని, అన్ని మండల కేంద్రాల్లో మోడల్ ఇందిరమ్మ ఇళ్ల పనులు ఈనెల 25లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీపీవో జగదీశ్వర్, డీఆర్డీవో వేణుమాధవ్, హౌసింగ్ పీడీ గంగాధర్, తదితరులున్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు ప్రత్యేక వైద్య శిబిరం

తెలంగాణచౌక్, మే 14: సరస్వతీ నది పుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలో విధి నిర్వహణలో ఉండే ఆర్టీసీ ఉద్యోగులకు ఆరోగ్యావసరాల దృష్ట్యా ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కరీంనగర్ జోనల్ వైద్యశాల వైద్యాధికారి ఏవీ గిరిసింహారావు తెలిపారు. బుధవారం జోనల్ హాస్పిటల్‌లో ఆయన మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రయాణ ప్రాంగణంలో ఈనెల 15 నుంచి 26 వరకు కొనసాగే శిబిరంలో అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన మందులు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కరీంనగర్ జోన్ పరిధిలోని ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం రీజియన్ల పరిధిలో పని చేసే ఆర్టీసీ సిబ్బంది వైద్య సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. లక్షల మంది భక్తులను గమ్య స్థానాలకు చేరవేసే ఆర్టీసీ ఉద్యోగులు ఆరోగ్య జాగ్రత్తలను పాటిస్తూ విధులను నిర్వహించాలని సూచించారు.

## రెండు గ్రామాల్లో భూ భారతి సదస్సులు

సైదాపూర్, మే 14: మండలంలోని సోమారం, ఎలబోతారం గ్రామాల్లో బుధవారం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రెండు గ్రామాల్లో రైతులు తమ భూ సమస్యలపై 151 దరఖాస్తులను అధికారులకు అందించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, అధికారులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా ఎదగాలి

తిమ్మాపూర్ రూరల్, మే 14: ప్రభుత్వం అందజేస్తున్న శిక్షణలు, పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రంలో 20 మంది మహిళలకు ఎలక్ట్రికల్ ఆటో డ్రైవింగ్‌లో గత నెల 12 నుంచి నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ బుధవారం పరిశీలించారు. అనంతరం శిక్షణ పొందిన మహిళా డ్రైవర్లు ఆటో నడుపుతుండగా కలెక్టర్ ప్రయాణించారు. మహిళా ఆటో డ్రైవర్ల శిక్షణకు సహకరించిన బజాజ్ బృందాన్ని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ సుధారాణి, బజాజ్ కంపెనీ మేనేజర్లు అనిల్ కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఫ్లోరింగ్ మరమ్మతులకు చర్యలు తీసుకోవాలి

కలెక్టరేట్, మే 14 : కలెక్టరేట్‌లో ఉద్యోగులు, ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిన ఫ్లోరింగ్‌కు తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం నుంచి ఆడిటోరియం వైపు వెళ్లే రెండు మార్గాల్లోని ఫ్లోరింగ్ పూర్తిగా దెబ్బతిని, రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఉద్యోగులతో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు కూడా పలుమార్లు కిందపడి ప్రమాదాల బారిన పడ్డ ఘటనలు కలెక్టర్ దృష్టికి వెళ్లగా, బుధవారం పరిశీలించారు. వెంటనే మరమ్మతులకు అవసరమైన చర్యలు చేపట్టాలంటూ సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, రహదారులు, భవనాల శాఖ అధికారులు, తదితరులు ఉన్నారు.

## ప్రారంభమైన డిగ్రీ పరీక్షలు

కమాన్‌చౌరస్తా, మే 14 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డీ సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆరో సెమిస్టర్ పరీక్షకు 12,258 మంది విద్యార్థులకు గానూ 11,689 మంది హాజరయ్యారని తెలిపారు. అలాగే, నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో 10,318 మంది విద్యార్థులకు గానూ 9,954 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

## నూతన కానిస్టేబుళ్లకు టెక్నాలజీపై శిక్షణ

కరీంనగర్, మే 14 (నమస్తే తెలంగాణ): కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లోని పోలీస్ స్టేషన్లలో కొత్తగా నియమితులైన కానిస్టేబుళ్లకు టెక్నాలజీ వినియోగంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. కమిషనరేట్ కేంద్రంలోని ఐటీ కోర్ కార్యాలయంలో పోలీసులు వినియోగించే వివిధ సాఫ్ట్‌వేర్‌లు, అప్లికేషన్లు, సాంకేతిక పరిజ్ఞానంపై ఈ శిక్షణ కొనసాగుతున్నది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ఈ శిక్షణలో భాగంగా సీసీటీఎన్ఎస్ - 2.0, పిటిషన్ మేనేజ్ మెంట్ సిస్టమ్‌లో ఈ-సమన్ల జారీ, అమలు, టీఎస్-కాప్, హెచ్ ఆర్ ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్ సీఈఐఆర్, సైబర్ క్రైమ్‌లో ఆర్థిక, ఆర్థికేతర నేరాల గురించి, సీడీఆర్ వంటి అన్ని రకాల సాఫ్ట్‌వేర్, అప్లికేషన్‌లపై మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. నేరాల ఛేదనలో సాంకేతికతను ఉపయోగించడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐటీ కోర్ కార్యాలయ ఇన్‌స్పెక్టర్ జె. సరిలాల్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాకేంద్రంలో మహిళా కమిషన్ సభ్యురాలి పర్యటన

కలెక్టరేట్, మే 14 : మహిళా కమిషన్ సభ్యురాలు కటారి రేవతిరావు బుధవారం జిల్లా కేంద్రంలో పర్యటించారు. జిల్లా జైలు, సఖీ కేంద్రాన్ని సందర్శించారు. జైలులో మహిళా ఖైదీలతో మాట్లాడి వారికి అవసరమైన ఏర్పాట్లు కల్పిస్తున్నారా?లేదా? అని ఆరా తీశారు. ఆహారం, వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఖైదీల ఆధ్వర్యంలో జైలులో ఏర్పాటు చేసిన అగర్‌బత్తీల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం సప్తగిరి కాలనీలోని సఖీ కేంద్రానికి వెళ్లి, రిజిస్టర్లు తనిఖీ చేశారు. కేంద్రాన్ని ఆశ్రయించి కౌన్సెలింగ్ తీసుకున్న వారి వివరాలు పరిశీలించారు. ఆమె వెంట డీడబ్ల్యూవో ఎం.సరస్వతి, సఖీ కేంద్రం అడ్మిన్ లక్ష్మి, కో ఆర్డినేటర్ శ్రీలత, రేణుక, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరుపాలి

తెలంగాణచౌక్, మే 14: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపి వేసి, మావోయిస్టులతో చర్చలు జరుపాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క నారాయణరావు డిమాండ్ చేశారు. నగరంలోని ఫిలీం భవనంలో పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఆ సంఘం 5వ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పోలీసులు అక్రమంగా అరెస్టు చేసిన పోగుల రాజేశంను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీక్షణం ఎడిటర్ ఎన్ వేణుగోపాల్ మాట్లాడుతూ, ప్రభుత్వాలు ఆదివాసులకు మద్దతుగా ఉన్న మావోయిస్టులను వివిధ ఆపరేషన్ల పేరిట బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నాయని ఆరోపించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ, ఆపరేషన్ కగార్ నిలిపి వేసి కేంద్ర ప్రభుత్వం చర్చలు జరుపాలన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా సుచరిత, వినోద్, ప్రధాన కార్యదర్శిగా సంజీవ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా సంపత్, కోశాధికారిగా పర్వతాలు ఎన్నికయ్యారు. సమావేశంలో సంఘం నాయకులు కుమారస్వామి, మల్లన్న, రమేశ్, చందర్, రవి, సుచరిత, రాజాలింగం పాల్గొన్నారు.

## వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ

జమ్మికుంట (హుజూరాబాద్ టౌన్), మే 14: జమ్మికుంట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇంజమూరి వెంకటలక్ష్మి అనే వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి లాక్కొని పరారయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటలక్ష్మి బుధవారం ఉదయం 5.30 గంటలకు నిద్రలేచి ఆరు బయట ఉండగా, గుర్తు తెలియని వ్యక్తి ఆమె వద్దకు వచ్చి తాత ఉన్నాడా? అని అడుగుతూ మెడలోని తులం బంగారు గోపు తాడు లాక్కొని పరారయ్యాడు. దీని విలువ సుమారు 35వేల రూపాయలు ఉంటుందని, వెంకటలక్ష్మి కుమారుడు వెంకట సత్యనారాయణ స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

కమాన్‌చౌరస్తా, మే 14 : రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ విద్యాసంస్థల్లో కేజీ నుంచి పీజీ వరకు ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేసే బాధ్యత సీఎం రేవంత్ రెడ్డి తీసుకోవాలని, అప్పుడే ప్రజాపాలన అవుతుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తలు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో బీటెక్ ఫీజులు పెంచాలని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు చేసిన ప్రతిపాదనలను ఉన్నత విద్యామండలి, టీజీఎఫ్ఆర్సీ తిరస్కరించాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్ రెడ్డి, బొల్లి సాయి, మచ్చ పవన్, వినయ్ రెడ్డి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

శంకరపట్నం/వీణవంక, మే 14: ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ పిలుపునిచ్చారు. బుధవారం శంకరపట్నం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో, వీణవంక మండల కేంద్రంలో సార్వత్రిక సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని దుయ్యబట్టారు. 20న వీణవంక మండల కేంద్రంలో బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించనున్న నిరసన ర్యాలీలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా ప్రతిఘటించాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ, ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## 17న క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

కొత్తపల్లి, మే 14 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో జరిగే క్రికెట్ పోటీల్లో పాల్గొనే నియోజకవర్గ స్థాయి జట్టు ఎంపిక పోటీలను ఈనెల 17న నిర్వహించనున్నట్లు కేడీసీఏ అధ్యక్ష కార్యదర్శులు ఆగం రావు, మురళీధర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆరు జట్లను ఎంపిక చేసి ఆ జట్లను రౌండ్ రాబిన్‌లీగ్ పద్ధతిలో పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 17 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల్లోపు వయసు గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు కేడీసీఏ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కొత్తపల్లి, మే 14 : సైబర్ నేరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని రేకుర్తిలో గల లయోలా కళాశాలలో దేశ సైన్యం, పలు రక్షణ రంగాల్లో ఉద్యోగాల శిక్షణ పొందుతున్న యువకులకు సైబర్ మోసాలు, మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం - దుష్పరిణామాలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సీఐ మాట్లాడుతూ, బ్యాంకు ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బులను దొంగిలించినట్లయితే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి భావి భారత నిర్మాణంలో కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కొత్తపల్లి ఎస్ఐ ఎస్ సాంబమూర్తి, శిక్షణ విభాగం ఇన్‌చార్జి కొత్త సతీశ్‌రెడ్డితో పాటు 200 మంది యువకులు పాల్గొన్నారు.

## ఈజీఎస్ కూలీలకు పని కల్పించాలి

చిగురుమామిడి, మే 14: గ్రామాల్లో ఈజీఎస్ కూలీలకు రోజువారి కూలి 307 రూపాయలు వచ్చేలా పని కల్పించాలని మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) రాజశేఖర్ రెడ్డి ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గ్రామాల వారీగా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు ఐక్యతతో మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఏపీవో రాజు, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు

చిగురుమామిడి, మే 14: ట్రాక్టర్ యజమానులు ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ట్రైనీ ఎస్ఐ జగదీశ్ హెచ్చరించారు. రామంచ గ్రామంలో బుధవారం ఇసుక ట్రాక్టర్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలోని మోయ తుమ్మెద వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తీసుకెళ్ల వద్దన్నారు. భూగర్భ జలాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎలాంటి పైరవీలతో ఇసుక గురించి తమ వద్దకు రావద్దని ఎస్ఐ స్పష్టం చేశారు.

## నేటి నుంచి ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం

కొత్తపల్లి, మే 14 : కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జిల్లా యువజన, క్రీడాశాఖ సహకారంతో ఈనెల 15 నుంచి ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమవుతాయని డీవైఎస్‌వో వీ శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం సాయంత్రం నగరంలోని డా బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో సాయంత్రం ఈ శిక్షణ శిబిరాలు ప్రారంభమవుతాయని, ప్రతి రోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శిబిరాలు కొనసాగుతాయని, జూన్ 10న ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 16 క్రీడాంశాల్లో శిక్షణలకు సుమారు 1500 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు.


నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336370-AII

CHANGE OF NAME

★Nakka Kalpana W/o Nakka Ashok (Old name), H.No. 6-52, v/o Mandepally, Thangallapally mandal, Rajanna Sircilla. Pin. 505405, my Name is changing to Gunti Veena Devi W/o Nakka Ashok D/o Gunti Yellaiah (New Name)
NTK-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189


## వివాహాలకు హాజరైన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

హుజూరాబాద్ టౌన్, మే 14: హుజూరాబాద్ పట్టణంతో పాటు మండలంలో బుధవారం జరిగిన పలు వివాహాలకు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హాజరయ్యారు. పట్టణంలోని మధువని గార్డెన్స్‌లో ఇప్పల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన పుట్టపాక అయిలయ్య కూతురు వివాహానికి, ప్రతాప సాయి గార్డెన్స్‌లో చిట్ల కుమారస్వామి కుమారుడి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు బండ శ్రీనివాస్, గందె శ్రీనివాస్, తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, తాటిపాముల రమేశ్, అఖిల్, తదితరులు ఉన్నారు.

## పట్నాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి, మే 14: మండలంలోని భూపాలపట్నం గ్రామంలో జరుగుతున్న ఎల్లమ్మ పట్నాలకు బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నేడు ఆలయ భూముల వేలం

రామడుగు, మే 14 : మండలంలోని గుండి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్ 207, 208, 209, 210లో 4.13 ఎకరాల భూమిని కౌలు ద్వారా సేద్యం చేసుకునేందుకు 15న ఉదయం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు సర్వే నంబర్ల ప్రకారం విడివిడిగా రూ.2వేలు ధరావత్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. ఆలయ భూముల కౌలు కాల పరిమితి రెండు సంవత్సరాలుగా నిర్ణయించినట్లు తెలిపారు.

## ఉపాధ్యాయులకు రెండో రోజు శిక్షణ

కమాన్‌చౌరస్తా, మే 14: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల కేంద్రంగా కలెక్టర్ పమేలా సత్పతి, డీఈవో జనార్ధన రావు సారథ్యంలో ఉపాధ్యాయులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై రెండో రోజు శిక్షణ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి. శ్రీనివాసరావు, సీఐ జి.రాము, ఎస్ అశోక్ కుమార్, ఎస్ఐలు కే.లక్ష్మణ్, మహమ్మద్ ఇషాక్, కోర్స్ సమన్వయకర్త కే అశోక్ రెడ్డి, మండల విద్యాధికారి డి. ఆనందం హాజరై మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. నేడు చాలా మంది విద్యార్థులు అవగాహన లేమితో మాదకద్రవ్యాలకు బానిస అవుతున్నారని, దీనిని నివారించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉన్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్, ప్రభుత్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చామనపల్లిని సందర్శించిన డీపీవో

కరీంనగర్ రూరల్, మే 14: చామనపల్లి గ్రామ పంచాయతీని బుధవారం ఉదయం జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ ఆకస్మికంగా విజిట్ చేశారు. గ్రామంలోని పారిశుధ్య పనులతో పాటు నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డు, విటమిన్ గార్డెన్, వైకుంఠ ధామాన్ని పరిశీలించారు. ఉపాధిహామీ పనులను పరిశీలించి కార్మికులతో మాట్లాడారు. రోజువారీ, నెలసరి కూలి ఎంత వస్తున్నదని వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కె. మహేందర్‌రావు, ఫీల్డ్ అసిస్టెంట్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## నల్ల పోచమ్మ నాటక ప్రదర్శనకు రండి



మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నల్ల పోచమ్మ కళాప్రదర్శన కమిటీ సభ్యులు

గన్నేరువరం, మే 14 : గునుకుల కొండాపూర్‌లో ఈ నెల 17, 18 తేదీల్లో జరిగే నల్ల పోచమ్మ నాటక ప్రదర్శన కార్యక్రమానికి రావాలని నల్ల పోచమ్మ కళాప్రదర్శన కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను ఆహ్వానించారు. బుధవారం బెజ్జంకి మండలం గుండారంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో నల్ల పోచమ్మ కళాప్రదర్శన కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు న్యాలపట్ల శంకర్ గౌడ్, సాఫ్ట్‌వేర్ లింగంపల్లి తిరుపతి, ముఖ్య సలహాదారు కొరివి కొమురయ్య, భక్తులు పాల్గొన్నారు.

## డీఆర్ఎంగా మల్లేశం

తెలంగాణచౌక్, మే 14: ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్)గా మల్లేశం బస్టాండ్ ఆవరణలోని డీఆర్ఎం కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లో అసిస్టెంట్ వర్క్స్ మేనేజర్‌గా పని చేస్తున్న మల్లేశం ఉద్యోగోన్నతిపై కరీంనగర్ డీఆర్ఎంగా బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డీఆర్ఎం వెంకటేశ్వరరావు అనారోగ్య కారణలతో సెలవులో వెళ్లారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన డీఆర్ఎం, ఆర్ఎం చాంబర్‌లో ఆర్ఎం రాజును మర్యాదపూర్వకంగా కలువగా, శుభాకాంక్షలు తెలిపారు.

## పలు కాలనీల్లో అంధకారం

శంకరపట్నం, మే 14: కేశవపట్నం గ్రామంలోని పలు వార్డుల్లో అంధకారం నెలకొన్నది. గ్రామంలోని 3, 4, 5వ వార్డుల్లో మూడు రోజులుగా వీధి లైట్లు వెలగకపోవడంతో రాత్రి పూట జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా, సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టినా ఎవరూ స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా శ్రద్ధ చూపాలని ఆయా కాలనీలవాసులు డిమాండ్ చేస్తున్నారు.

## మేలైన సాగు పద్ధతులపై అవగాహన

మానకొండూర్, మే 14: మండలంలోని పచ్చునూర్ రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయంలోని వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు మేలైన సాగుపద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ డీ శ్రావణి హాజరై, వానకాలానికి సంబంధించిన వివిధ రకాల పంటలు, యాజమాన్య పద్ధతులు, విత్తనాల రకాలు, మేలైన సాగు పద్ధతులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరీంనగర్ శాస్త్రవేత్త సీ మధుకర్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, జిల్లా ఉద్యానవన అధికారి ఆర్ శ్రీనివాస్‌రావు, జిల్లా సహకార సంఘం అధికారి రామానుజాచార్యులు, సహాయసంచాలకులు ఎన్ శ్రీధర్, మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, పశువైద్యాధికారి డాక్టర్ అరవింద్‌రెడ్డి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మే 14: విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, 11కేవీ ఫీడర్ల మరమ్మతులు చేపడుతున్నందున గురువారం నగరంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1, 2 ఏడీఈ లు పీ శ్రీనివాస్, లావణ్య వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఉదయం 8.30నుంచి 10.30గంటల వరకు శక్తి టెంపుల్ ఏరియా, బాలాజీ సూపర్ మార్కెట్, సంతోష్ నగర్, సంతోష్ మాత గుడి, భాగ్యనగర్, శ్రీనగర్ కాలనీ, భవానీ కాలనీ, సప్తగిరి కాలనీ, తహెరా మజీద్, అంజనాద్రి గుడి, ధోబీ ఘాట్, గోదాం, బీఎస్ఎఫ్ క్వార్టర్స్, ఏహోస్ కాలనీ, జెడ్పీ క్వార్టర్స్, భగత్ నగర్, ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఉజ్వల పార్కు సబ్ స్టేషన్ వరకు (బైపాస్ ఏరియా), పాలిటెక్నిక్ కాలేజీ, శ్రద్ధ ఇన్ హోటల్, ఐటీఐ కాలేజీ, డీ మార్ట్ ఏరియా, ఉదయం 7నుంచి 9గంటల వరకు హౌసింగ్ బోర్డు కాలనీ, విట్స్ కాలేజీ, సుభాష్ బొమ్మ ప్రాంతం, వరాహ స్వామి గుడి, మారుతీ నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

తిమ్మాపూర్ రూరల్, మే 14: మండలంలోని అలుగునూర్, ఎల్ఎండీ కాలనీ, మహాత్మా నగర్, తిమ్మాపూర్, జోగయ్యపల్లె గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అలుగునూర్ సబ్ స్టేషన్‌లో కొత్త బ్రేకర్లు ఏర్పాటు చేసే క్రమంలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు.

## మందుబాబులకు అడ్డాగా పోస్టాఫీస్

శంకరపట్నం, మే 14: కేశవపట్నంలోని పోస్టాఫీస్ ప్రాంతం మందు బాబులకు అడ్డాగా మారింది. అంబేద్కర్ విగ్రహం నుంచి ఊర్లోకి వెళ్లే దారిలోని పోస్టాఫీస్ సమీపంలోనే ఓ వైన్స్ షాపు ఉంది. దీంతో రాత్రి సమయాల్లో మందు బాబులు బహిరంగంగా ఏకంగా పోస్టాఫీస్ ముందే కూర్చుని దర్జాగా మద్యం సేవించడం రివాజుగా మారింది. దీంతో ఆ కాలనీవాసులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పలు మార్లు అధికారులకు ఫిర్యాదులు చేశారు. బహిరంగంగా మద్యం సేవిస్తున్నా పోలీసులు అటువైపు చూసీ చూడనట్లు వెళ్తున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఓ మందు బాబు ఏకంగా పోస్టాఫీస్ వద్దే సిట్టింగ్ వేసి పెగ్గులు లాగించడం చర్చనీయాంశంగా మారింది.

## చట్టాన్ని అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలి

కలెక్టరేట్, మే 14: గోరక్షకుల ముసుగులో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ కోరారు. బుధవారం నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు, ముస్లింలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, బక్రీద్‌లో ఖుర్బాన్ ఇచ్చే జంతువుల్లో ఆవులు, చిన్న దూడలు, జింకలు లాంటి సాదు జంతువులు ఉండకుండా చూడాలని, పశువైద్యుడు ధ్రువీకరించిన ఆరోగ్యకరమైన జంతువులు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చట్ట పరిధిలో వ్యవహరిస్తూ పండుగ జరుపుకోవాలని, చట్టాన్ని అతిక్రమించకుండా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్క ముస్లిం పాటుపడాలని కోరారు. సమావేశంలో ఎంఐఎం నాయకులు, పలువురు ముస్లిం మతపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.